

అక్కినేని ప్రతిభా పురస్కారాలు అందుకున్న తోటకూర ప్రసాద్, కొత్త సుబ్రహ్మణ్యం, ఎం.పి.కన్నేశ్వరరావు, బొల్లిముంత కృష్ణ, డాక్టర్ బ్రహ్మాజీ

# అక్కినేని జీవితం యువతకు స్ఫూర్తి

## తెనాలిలో నాగేశ్వరరావు పురస్కార ప్రదాన సభలో వక్తలు

**తెనాలి(మారీస్‌పేట),న్యూస్‌టుడే:** దాదా సాహెబ్ పాల్కే పురస్కార గ్రహీత అక్కినేని జీవితం నేటి యువతకు స్ఫూర్తి కావాలని తానా మాజీ అధ్యక్షుడు, ఇండో అమెరికన్ ఫ్రెండ్‌షిప్ కౌన్సిల్ కార్యదర్శి తోటకూర ప్రసాద్ అన్నారు. వెన్నం ఫౌండేషన్ ఆఫ్ అమెరికా సహకారంతో డాక్టర్ అక్కినేని ఇంటర్నేషనల్ ఫ్యాన్స్ వారు ఏర్పాటు చేసిన ప్రతిభా పురస్కారాలను ప్రముఖులకు అందజేశారు. స్థానిక రాధా కృష్ణ కల్యాణ మండపంలో మంగళవారం రాత్రి జరిగిన పురస్కార ప్రదాన సభకు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ నటునిగా, వ్యక్తిగా సమాజానికి మార్గదర్శిగా నిలిచిన వ్యక్తి అక్కినేని పేరుతో ప్రముఖులకు పురస్కారాలు అందజేయడం అభినందనీయమన్నారు. అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ అమెరికా ఉపాధ్యక్షుడు రవి కొండబోలు మాట్లాడుతూ నాగేశ్వరరావుతో తనకున్న 20ఏళ్ల స్నేహ బంధం మరువలేనిదన్నారు. ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ అక్కినేని శిలగా ఉన్న తనను తానే శిల్పిగా మారి శిల్పంగా మలచుకున్న గొప్ప మనిషి అన్నారు. సినీ పాత్రికేయుడు ఎస్.వి.రామారావు అక్కినేనితో తనకుగల సంబంధాన్ని వివరించారు. తానా మాజీ అధ్యక్షుడు తోటకూర ప్రసాద్, కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం, రంగస్థల నటుడు, రచయిత, దర్శకులు ఎం.పి. కన్నేశ్వరరావు, సంగీత దర్శకులు బొల్లిముంత కృష్ణ, వైద్యులు యడ్ల బ్రహ్మాజీలను అక్కినేని పురస్కారాలతో సత్కరించారు. తారకేశ్వరావు, కాకుమాను రాంబాబు, జి. రామనాగేశ్వరరావు పర్యవేక్షించారు.

ఈనాడు
అమరావతి
బుధవారం 23 డిసెంబరు 2015 ★ 20 పేజీలు